# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం 35 వేల కోట్ల రూపాయల వ్యయంతో రూపొందించిన రెండు నూతన పథకాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ప్రారంభించనున్నారు.**

**2. రామయ్యపట్నం వద్ద భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ రిఫైనరీని ఏర్పాటు చేయనుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**3. ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ వ్యవస్థలో సంస్కరణలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**

**4. హైదరాబాద్ అభివృద్ధికి 10 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.**

**5. రాష్ట్రంలో 210 కోట్ల రూపాయల వ్యయంతో రెండు ఆయుర్వేద, ఒక యూనాని వైద్య కళాశాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.**

=========================

కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం 35 వేల కోట్ల రూపాయల వ్యయంతో రూపొందించిన రెండు నూతన పథకాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ప్రారంభించనున్నారు. ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన, ఆత్మనిర్భరత మిషన్ పథకాలను ఢిల్లీలో జరిగే ఒక కార్యక్రమంలో ఆయన ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి రైతులతో ముచ్చటించనున్నారని అధికారులు పేర్కొన్నారు.

కాగా ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన కింద దేశ వ్యాప్తంగా వంద జిల్లాలను ఎంపిక చేయగా, ఆంధ్రప్రదేశ్‌లో శ్రీ సత్యసాయి, అనంతపురం, అల్లూరి సీతారామరాజు, అన్నమయ్య జిల్లాలు ఉన్నాయి. అదేవిధంగా తెలంగాణలో నారాయణ్ పేట్, జోగులాంబ గద్వాల్, జనగాం, నాగర్ కర్నూల్ జిల్లాలు ఎంపికయ్యాయి.

-------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని రామయ్యపట్నం వద్ద భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ – బిపిసిఎల్ సంస్థ రిఫైనరీని ఏర్పాటు చేయనుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. జిల్లాలోని ఈదగాలిలో విశ్వసముద్ర ఇథనాల్ ప్లాంట్ ను ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ..

(వాయిస్.. 30 సెకన్లు)

---------------------------

హైదరాబాద్ అభివృద్ధికి 10 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నగరంలోని హైటెక్స్ లో నరెడ్కో ప్రాపర్టీ షోను మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం హైదరాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. తాగునీరు, నిరంతర విద్యుత్ అందించడంతోపాటు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామ పంచాయతీ వ్యవస్థలో సంస్కరణలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం అమరావతిలోని సచివాలయంలో నిన్న జరిగింది. రాజధాని అమరావతిలో రాజ్ భవన్ నిర్మాణానికి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటుకు భూ కేటాయింపులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రివర్గ సమావేశం వివరాలను సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు వివరిస్తూ...

(వాయిస్...34 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలో 210 కోట్ల రూపాయల వ్యయంతో రెండు ఆయుర్వేద, ఒక యూనాని వైద్య కళాశాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆరు జిల్లాల్లో సమగ్ర ఆసుపత్రులు ఏర్పాటు చేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో ఆసుపత్రి ఏర్పాటుకు 7 కోట్ల రూపాయల వ్యయం కానుందన్నారు. ఆయుర్వేద ఆరోగ్య మందిరాల అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు.

---------------------------

అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా వస్తు సేవల పన్ను – జీఎస్టీ శ్లాబులను ప్రభుత్వం సవరించిందని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 'సూపర్ జిఎస్‌టి –సూపర్ సేవింగ్స్' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ఏర్పాటు చేసిన వివిధ ఉత్పత్తుల రెండు రోజుల ప్రదర్శన, విక్రయాలను కలెక్టర్ నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

(వాయిస్... 30 సెకన్లు)

---------------------------

వివక్షతో బాలికల స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదని సమగ్ర శిశు అభివృద్ధి పథకం ప్రాజెక్ట్ అధికారి జయంతి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండల పరిషత్ కార్యాలయంలో పోషణ మాహ్, బాలికల సంరక్షణ కార్యక్రమాలను నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు రక్తహీనత కలగకుండా పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. బాలికలు తమ హక్కులు తెలుసుకోవాలన్నారు.

వీరు ఆరోగ్యం, విద్యపై దృష్టిపెట్టి, సామాజికంగా ఎదగాలని పిలుపునిచ్చారు.

---------------------------

సమాజంలో బాలికల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఈ రోజు అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా అక్టోబర్ 11వ తేదీన అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించాలని 2011 డిసెంబర్ 19వ తేదీన ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ చేసిన తీర్మానం మేరకు ప్రతి ఏటా అక్టోబర్ 11న ఈ కార్యక్రమం జరుగుతోంది. లింగ వివక్షతను నిర్మూలించడం, బాలికలకు మెరుగైన ఆరోగ్యం కల్పించడం, అన్ని రంగాలలో వారికి సమాన అవకాశాలు కల్పించడం, బాలికలపై హింసలేని సమాజం నిర్మించడం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వాహణలోని ముఖ్యోద్దేశం.

---------------------------

తెలంగాణలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. హైదరాబాదులోని సచివాలయంలో అధికారులతో ఆయన నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వసతి గృహాల్లో విద్యార్థుల కోసం మెరుగైన వసతి, పోషకాహారం, సురక్షితమైన తాగునీటి సదుపాయం తప్పని సరిగా కల్పించాలని సూచించారు.

---------------------------

ఢిల్లీలోని అరుణ్ జేట్లీ స్టేడియంలో భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ రెండవ టెస్ట్, తొలి ఇన్నింగ్స్‌లో భాగంగా మొదటి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 2 వికెట్ల నష్టానికి 318 పరుగులు చేసింది. 2వ రోజు ఆట ఈ ఉదయం 9 గంటల 30 నిముషాలకు ప్రారంభం కానుంది.

---------------------------

ఉత్తర ఆంధ్ర, దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి సగటున 0.9 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో.. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రానున్న రెండు రోజులపాటు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ..

..వాయిస్.. 30 సెకన్లు

తెలంగాణలోనూ రానున్న రెండు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================